సంక్షోమ వసతి గృహం

- బాలికల నిలయం.. సమస్యల వలయం
- సౌకర్యాల లేమితో విద్యార్థినుల అగచాట్లు



రక్షణ గోడ లేకపోవడంతో హాస్టల్ చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచిన దృశ్యం

కామవరపుకోట: పేద విద్యార్థులకు చదువుతో పాటు హాస్టల్ వసతి కల్పించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన వసతి గృహాల్లో అధికారులు నిర్లక్ష్యం వలన విద్యార్థులు ఆకలితో అలమటించడంతోపాటు, హాస్టల్లో సరైన మౌలిక సదుపాయాలు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ఆడమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు చొరవతో ఈ ఏడాది ఫిబ్రవరిలో బాలికలకు వసతి గృహం ప్రారంభించి, హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షల ఎంపీ నిధులు కేటాయించారు. అదే సమయంలో అప్పటి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అదనంగా రూ.9 లక్షల రాష్ట్ర ప్రభుత్వ నిధులు కేటాయించారు. అయితే హాస్టల్ చుట్టూ సుమారు 200 మీటర్ల ప్రహరీ గోడ నిర్మించవలసి ఉండగా, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించిన 9 లక్షలను ఇప్పటి ప్రభుత్వం రద్దు చేసి, ఎంపీ నిధులతో మాత్రమే 100 మీటర్ల ప్రహరీ అసంపూర్తిగా నిర్మించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ హాస్టల్లో 63 మంది బాలికలు ఉంటున్నారు. ఈ వసతి గృహంలో నాణ్యతమైన భోజనం అందించకపోవడంతో విద్యార్థులు అటు ఇంటికి వెళ్లలేక, ఇక్కడ ఉండలేక అర్థాకలితో అలమటిస్తున్నామని బాలికలు వాపోయారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ హాస్టల్ ఊరు శివారులో ఉండటం, ఇక్కడ సరైన సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రి అయితే విద్యార్థినులు బిక్కుబిక్కుమంటు ఉంటున్నారు. జనరేటర్ సదుపాయం లేకపోవడంతో, కరెంటు పోతే ఆ ప్రాంతం అంధకారంగా మారుతుంది. ఇక్కడ వార్డెన్ కాకుండా నలుగురు సిబ్బంది పని చేయవలసి ఉండగా ఇద్దరే పని చేస్తున్నారు. వార్డెన్ కూడా అప్పుడప్పుడు వస్తుందని, వసతి గృహంలో శానిటేషన్ సౌకర్యం లేదని మరుగుదొడ్ల నుంచి దుర్వాసన వస్తుందని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు. అధికారులు స్పందించి విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడంతో పాటు, మంచినీటి సదుపాయం, హాస్టల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



బాలికల వసతి గృహాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు (ఫైల్)



హాస్టల్ బయటకు వెళ్లి మంచినీరు పట్టుకుంటున్న బాలికలు

మౌలిక వసతులు కల్పించాలి



ప్రభుత్వం బాలికల సంరక్షణను దృష్టిలో పెట్టుకుని, చుట్టూ ప్రహరీగోడ, మంచి నీటి సదుపాయం, జనరేటర్ సదుపాయం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి హాస్టల్లో సరైన మౌలిక వసతులు కల్పించాలి.

– కంభం విజయరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్, చింతలపూడి

మెనూ ప్రకారం భోజనం అందించాలి



హాస్టల్లో చాలీచాలని సరుకులతో వంట చేసి, నాణ్యత లేని భోజనం అందిస్తున్నారు. దీంతో అర్థాకలితో అలమటిస్తున్నాం. అధికారులు స్పందించి, ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలి.

– మిరియాల ఝాన్సీరాణి, బీఏ రెండో సంవత్సరం విద్యార్థిని

మంచినీటి వసతి కల్పించాలి



హాస్టల్లో మంచినీరు లేక ఇబ్బంది పడుతున్నాం. బయటికి వెళ్లి మేమే తెచ్చుకోవాల్సి వస్తుంది. భోజనం చేసే సమయంలో హాస్టల్లో మంచినీళ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కనుక హాస్టల్లో ఆరో ప్లాంట్ ఏర్పాటు చేసి మంచినీటి వసతి కల్పించాలి.

– కారం మౌనిక, బీఎస్సీ, రెండో సంవత్సరం విద్యార్థిని

తక్షణం ప్రహరీ నిర్మించాలి



హాస్టల్ చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పగటిపూట పశువులు రావడంతో పాటు, రాత్రిళ్లు హాస్టల్‌లోకి విష పురుగులు వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కనుక హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మించాలి.

– యల్లమల్లి రాజ్యలక్ష్మి, బీఏ మొదటి సంవత్సరం విద్యార్థిని

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మకు శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కె.విజయశర్మ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహానికి పంచామృత, ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించిన ఆలయ నిర్మాణకర్త భవిరిశెట్టి మురళీకృష్ణ దంపతులు తెలిపారు. మూలవిరాట్‌కు సూర్య, చంద్ర, కుంభ, నక్షత్ర, కర్పూర హారతులు సమర్పించారు. చోడవరపు రంగా జ్యోతి దంపతులు, లైటింగ్ శీను, బ్రహ్మం, దువ్వ రామకృష్ణ, యర్రా నాగేశ్వరావు సత్య దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మీడియా ప్రతినిధులపై దాడి అమానుషం

జంగారెడ్డిగూడెం: మీడియా ప్రతినిధులపై విచక్షణా రహితంగా దాడులు చేయడాన్ని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డీవీ భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి కె.వెంకట్, కార్యవర్గ సభ్యులు కేవీ రమణారావు, ఎం.గంగరాజు శుక్రవారం తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ కడప జిల్లా వేముల వద్ద సాగునీటి సంఘం ఎన్నికలను కవర్ చేయడానికి వెళ్లిన సాక్షి మీడియా ప్రతినిధులపై అక్కడి రాజకీయ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడి గాయపరచడం బాధాకరమన్నారు. విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడాన్ని నిరసించారు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశార

క్లుప్తంగా

నేత్రపర్వం.. శ్రీవారి గ్రామోత్సవం



క్షేత్రంలో ఉభయ దేవేరులతో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: శ్రీ తిరుమంగయాళ్వార్ తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని చినవెంకన్న గ్రామోత్సవాన్ని శుక్రవారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, సుగంధ భరిత పుష్పమాలికలతో విశేషంగా అలంకరించారు. అనంతరం స్వామివారి వాహనం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు.

ఐదు వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

బుట్టాయగూడెం: మండలంలోని ముద్దప్పగూడెం, రాజానగరం, నాగన్నగూడెం గ్రామాల్లో శుక్రవారం పోలవరం ఎక్సైజ్ అధికారులు సారా తయారీ కేంద్రాలపై దాడి చేశారు. ఈ దాడిలో సుమారు ఐదు వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఈఎస్‌డీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సత్యవతి తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అజయ్‌కుమార్ సింగ్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవ్వుళయ్య సంయుక్త ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవీఎస్ఎస్ ఫణికుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా దీపజ్యోతి

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గుర్వాయిగూడెంలో స్వయంభూ శ్రీ రాజరాజేశ్వరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కృత్తికా నక్షత్ర మహాదీప జ్యోతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు కుమార్ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దల్లి గోపి నాగ ప్రసాద్‌రెడ్డి, కమిటీ సభ్యులు బుసా పండు, రఘుస్వామి, మోహన్ రెడ్డి, స్వామి, కండిపల్లి రాజు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

కామవరపుకోట: ఎన్‌సీసీతో క్రమశిక్షణతో పాటు, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ అమిత్ పాండే అన్నారు. శుక్రవారం తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీలో చేరే విద్యార్థుల కోసం దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ప్రతిభ కనబరిచిన 32 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను అంగులూరి సర్వేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్పొరేటర్ గోవిందరెడ్డి క్షమాపణ చెప్పాలి

చింతలపూడి: కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి క్షమాపణ చెప్పాలని గ్రామ సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ముందు ఈ మేరకు నిరసన తెలిపారు. విశాఖపట్నం జీవీఎంసీ కౌన్సిల్ మెంబర్, కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి గ్రామవార్డు సచివాలయం ఎంప్లాయిస్ మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ భేషరతుగా క్షమాపణ చెప్పాలని చింతలపూడి మండల సచివాలయం ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మురళీకృష్ణకు సచివాలయ ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు.

గీతా జయంతి మహోత్సవాల ప్రారంభం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో గీతా జయంతి మహోత్సవాలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 30 వరకు జరగనున్న ఈ ఉత్సవాలను ముందుగా శ్రీహరి కళాతోరణ వేదికపై ఆలయ ఈఓ ఎన్వీఎస్ఎన్ మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం శ్రీవారి ఆగమ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సుదర్శనం శ్రీనివాసాచార్యులు భగవద్గీత పారాయణం, ప్రవచనాలను నిర్వహించారు.

ఖోఖో పోటీల్లో డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపిక

చింతలపూడి: గోపన్నపాలెంలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన ఎస్ఆర్ఆర్‌జీసీపీ యూనివర్సిటీ ఖోఖో మహిళల టీం సెలక్షన్స్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని కె.మౌనిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ జట్టుకు ఎంపికైంది. ఈ జట్టు ఈ నెల 27 నుంచి 31 వరకు అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీల్లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ జట్టు నుంచి పోటీల్లో పాల్గొంటుంది.

అమ్మవారి వెండి చీరకు విరాళం

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉత్సవమూర్తికి వివిధ రకాల అభిషేకాలు, ధృవమూర్తికి నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. అమ్మవారి వెండి చీర నిమిత్తం 25 తులాల వెండిని జంగారెడ్డిగూడెంకు చెందిన వెలుగుల కార్తీక్, కృపాజ్యోతి దంపతులు అందజేశారు.

కూటమి పాలనలో రైతన్న కుదేలు



బుట్టాయగూడెం: విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు



జంగారెడ్డిగూడెం: ఏలూరు తరలివెళుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- అన్నదాతకు అండగా విజయవంతం

బుట్టాయగూడెం: రైతుల గొంతుకై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వైఎస్సార్‌సీపీ అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ పేరుతో చేపట్టిన కార్యక్రమం పూర్తి విజయవంతమైందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి పాలనలో రైతన్నలు కుదేలయ్యారన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్లపాలనలో ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు చిరునవ్వులతో పంటలు పండించేవారన్నారు. పంటలు వేసేనాటికే రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా పథకంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాలోనే సొమ్ములు చెల్లించేవారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, నాయకులు అల్లూరి రత్నాజీరావు, తెల్లం చిన్నారావు, సర్పంచ్‌లు బన్నే బుచ్చిరాజు, ఉయికే బొజ్జి, మాల్చి వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన అన్నదాతకు అండగా కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు నేతృత్వంలో జంగారెడ్డిగూడెం పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఏలూరు తరలి వెళ్లారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య, మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, వైస్‌ఛైర్మన్ ముప్పిడి అంజి, జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీనివా స్, నాయకులు బత్తిన చిన్న, బీవీఆర్ చౌదరి, ఏవీ రమణమూర్తి, చింత అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

పుష్కరాల తొక్కిసలాటకు చంద్రబాబే బాధ్యుడు

కొయ్యలగూడెం: ప్రముఖ నటుడు అల్లు అర్జున్ సంధ్యా థియేటర్‌లో ఘటనకు బాధ్యుడిని చేస్తూ అరెస్టు చేయడం సబబు అయినప్పుడు, పుష్కరాల సంఘటనలో పాతిక మందికి పైగా పొట్టన పెట్టుకున్న చంద్రబాబు నాయుడును కూడా అరెస్టు చేయాలని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఏలూరులో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఆందోళన కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తూ కొయ్యలగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు



మాట్లాడుతున్న తహసిల్దార్ జి.ఎలిషా

కామవరపుకోట: మండలంలో ఏడు సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్ జి.ఎలీషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు ఆయా గ్రామాల పరిధిలో ఈ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. మొత్తం 1200 ఓటర్లు ఉన్నారని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ఎలిషా తెలిపారు.

ఎన్నికల సిబ్బందికి సూచనలు

టి.నరసాపురం: సాగు నీటి సంఘాల ఎన్నికలకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిబంధనల మేరకు అధికారులు, సిబ్బంది పని చేయాలని తహసీల్దార్ టి.సత్య సాయిబాబ అన్నారు. శుక్రవారం ఎన్నికల సిబ్బందికి తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. టి.నరసాపురంలో (నందమూరి విద్యాసాగర్ చెరువుకు) ఎన్నికల అధికారిగా ఎంపీడీవో వె.వెంకటేశ్వరరావు, మక్కినవారిగూడెంలో (జమ్మి చెరువుకు) ఎన్నికల అధికారిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణ, తిరుమలదేవిపేటలో(లక్ష్మీ నరశింహ సాగర్ చెరువుకు) ఎన్నిల అధికారిగా మండల విస్తరణ అధికారి శ్రీనివాసరావు, అప్పలరాజుగూడెంలో(అప్పలరాజు చెరువుకు) ఎన్నికల అధికారిగా ఉద్యాశాఖాధికారి లఖ్పతి విధులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

ఇంటి నుంచి వచ్చేసిన వృద్ధురాలి మృతి



వెంకటరమణ మృతదేహాన్ని తీసుకెళుతున్న కుటుంబ సభ్యులు

ద్వారకాతిరుమల: ఎవరికీ భారం కాకూడదని ఇంటి నుంచి బయటకు వచ్చి, క్షేత్రంలో తలదాచుకుంటున్న ఒక వృద్ధురాలు శుక్రవారం ఉదయం మృతి చెందింది. గుండెపోటు లేదా చలిగాలుల కారణంగా ఆమె మృతి చెంది ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఏలూరుకు చెందిన బండి వెంకటరమణ (75) గత మూడు నెలలుగా స్థానిక సూపర్‌బజార్ భవన ఆవరణలో, ఆరుబయట ఉంటోంది. చుట్టుపక్కల వారు పెట్టింది తింటూ జీవనం సాగిస్తోంది. ప్రతి నెలా మొదటి తేదిన ఏలూరు వెళ్లి, పింఛన్ తీసుకున్న తరువాత తిరిగి క్షేత్రానికి చేరుకుంటుంది. ఇదిలా ఉంటే వెంకటరమణ రోజులానే గురువారం రాత్రి సూపర్‌బజార్ ఆవరణలో, ఆరుబయట నిద్రించింది. ఉదయం నిద్రలేవక పోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి చూసే సరికి అప్పటికే ఆమె మృతి చెందింది. దీంతో ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లోని నెంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలి కోడలు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

ఘనంగా హనుమద్ వ్రత మహోత్సవాలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం హనుమద్ వ్రత మహోత్సవం నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచి విశ్వసేన ఆరాధన, పుణ్యాహవాచన, దీక్షాధారణ, గోకృత దీపారాధన, మండపారాధన, కుంభ పూజ, పంచామృతం మండపారాధన నిర్వహించారు.

కొయ్యలగూడెం: హనుమద్ వ్రత కల్యాణోత్సవాలు శుక్రవారం నుండి మండల వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. సరిపల్లి రోడ్డు లోని స్వయంభు శ్రీసంజీవ ఆంజనేయ స్వామి ఆలయంలో కలశ స్థాపన హనుమద్ వ్రతం నిర్వహించారు.

శ్రీవారి క్షేత్రంలో

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీఆంజనేయస్వామి వారి ఆలయంలో శుక్రవారం హనుమద్ వ్రత వేడుక అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు లక్ష తమలపాకులతో అర్చకులు పూజను నిర్వహించారు.

మద్ది క్షేత్రంలో

జంగారెడ్డిగూడెం రూరల్: మార్గశిర శుద్ధ త్రయోదశి సందర్భంగా మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో శుక్రవారం సామూహిక హనుమద్ వ్రత మహోత్సవాలు నిర్వహించారు.



జంగారెడ్డిగూడెం: భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమద్ వ్రతం నిర్వహిస్తున్న భక్తులు



కొయ్యలగూడెం: ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది క్షేత్రంలో హనుమద్ వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు



ద్వారకాతిరుమల: ఆంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ చేస్తున్న అర్చకులు

ఇరువర్గాలపై కేసుల నమోదు

జంగారెడ్డిగూడెం: ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. చిన్నవారిగూడెం గ్రామానికి చెందిన నైనారపు ఏడుకొండలు ఈ నెల నాలుగో తేదీన పత్తిపాటి వెంకటేశ్వర్లు ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, అతని భార్య రమ్యపై అసభ్యంగా ప్రవర్తించాడన్నారు. ఈ నేపథ్యంలో అక్కడికి వచ్చిన వెంకటేశ్వర్లు ఏడుకొండలను అడ్డుకుని మందలించి వదిలి వేశాడన్నారు. అయితే ఐదో తేదీన ఏడుకొండలు, మరో ఆరుగురితో వచ్చి వెంకటేశ్వర్లు, అతని కుటుంబ సభ్యులను కొట్టి గాయపర్చారన్నారు. సమస్యను పెద్దల్లో పెట్టినా పరిష్కారం కాకపోవడంతో శుక్రవారం వెంకటేశ్వర్లు భార్య రమ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు. అలాగే, చిన్నవారిగూడేనికి చెందిన నైనారపు ఏడుకొండలు ఈ నెల నాలుగో తేదీన గ్రామంలోని కమిటీ హాల్ వద్ద జంగారెడ్డిగూడేనికి చెందిన వంట మేస్త్రి, అదే గ్రామానికి చెందిన పత్తిపాటి బాలు ఘర్షణ పడడం చూశాడన్నారు. ఈ నేపథ్యంలో వంట మేస్త్రిని ఎందుకు కొడుతున్నావని బాలుని అడగ్గా, బాలు ఏడుకొండలను తీవ్రంగా గాయపర్చాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చెయ్యాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. రవి డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా మహాసభ సందర్భంగా సినిమా హాల్ సమీపంలో జరిగిన బహిరంగ సభలో అధ్యక్ష ఉపన్యాసంలో మాట్లాడుతూ తమ పార్టీ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకం కాదన్నారు. అయితే ఆ ప్రాజెక్టు కట్టే సందర్భంలో దాదాపు లక్ష కుటుంబాల వరకూ నిర్వాసితులుగా మారుతున్నారని వారి మాటేంటని ఆయన ప్రశ్నించారు.

ఎమ్మెల్యేపై ఫైర్ అయిన రవి

పోలవరం ఎమ్మెల్యేపై సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తీవ్రంగా మండిపడ్డారు. గిరిజన చట్టాలను అడ్డుపెట్టుకుని ఎవరికైనా నోటీసులు ఇస్తే వారిపై రౌడీషీట్ పెడతామని ఎమ్మెల్యే చేసిన ప్రకటనపై రవి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అయ్యా ఎమ్మెల్యే గారూ! మీరు పోలవరం నియోజకవర్గ ప్రతినిధి. ఆదివాసీ చట్టాలను అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మంతెన సీతారామ్, తెల్లం రామకృష్ణ, ఆర్. లింగరాజు, డీఎన్‌వీడి ప్రసాద్, ఎం. నాగమణి, ఏ. ఫ్రాన్సిస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో సీపీఎం ఏలూరు జిల్లా మహాసభలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రించకపోగా చంద్రబాబు ప్రభుత్వం బెల్ట్‌షాపులకు సంపూర్ణమైన అవకాశం ఇచ్చిందని విమర్శించారు.

చైన్ స్నాచింగ్‌ను అరికట్టేందుకు పటిష్ట చర్యలు



డీఎస్పీ యు.రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: పట్టణంలో చైన్ స్నాచింగ్ ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు నిఘా పటిష్టతతోపాటు గస్తీ ముమ్మరం చేశామని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. శనివారం పోలీస్ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకొని దొంగలు చైన్‌స్నాచింగ్ పాల్పడుతున్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడుతున్న వారి కోసం పోలీసులు నిరంతర నిఘ ఏర్పాటు చేశామన్నారు.

'మానవత' ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం: విద్యార్థిని చదువు నిమిత్తం మానవత సభ్యులు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. స్థానిక శ్రీవెంకటేశ్వర కళాశాలలో చదువుతున్న గుండా శ్రీవాస్తవ కుటుంబ కారణాల నేపథ్యంలో తల్లితండ్రుల వద్ద కాకుండా పెదనాన్న వద్ద పెరుగుతోంది. ఆర్థిక స్థితి అంతంత మాత్రంగా ఉండటంతో విషయం తెలుసుకున్న మానవత సభ్యులు శ్రీవాస్తవ కాలేజ్ ఫీజు నిమిత్తం రూ.5వేల చెక్కును కళాశాల యాజమాన్యం శ్రీధర్‌కు అందజేశారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త కొండూరు అంజేశ్వరరావు, మానవతా మండల కార్యదర్శి గద్దె సత్యనారాయణ, ట్రెజరర్ ఇమ్మంది మాధవరావు, జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, కార్యవర్గ సభ్యులు పెనుమర్తి సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.